సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 21 । జూన్ । 2024



అభ్యసనం.. అధ్యయనం..

యోగాలో అభ్యసనం.. అధ్యయనంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విలేజ్ దూసుకుపోతోంది. 8లో



విజేతలకు సత్కారం

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024లో పతకాలు సాధించిన విశాఖ క్రీడాకారులను సత్కరించారు. 8లో



43 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి రవాణా చేస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి 43 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి లలితాపీఠంలో ఆరాధనోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు గురువుల ఆరాధనోత్సవాలు, ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కరపత్రాలను కుర్తాళం శంకరాచార్యులు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఈనెల 21, 22, 23 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిచే త్రిశక్తి వైభవం ఉపన్యాసాలు జరుగుతాయని తెలిపారు. 24వ తేదీ సాయంత్రం శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామిచే జగద్గురు శంకర విజయంపై అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. 25న శ్రీలలితా సహస్రనామ పారాయణ, సువాసినీపూజ జరుగుతుందన్నారు. 26వ తేదీ సాయంత్రం మీగడ రామలింగస్వామి బృందంచే భక్త నత్కీర నాటక ప్రదర్శన, 27న డాక్టర్ డి.వి.సూర్యారావు ఆధ్వర్యంలో కవితాగోష్ఠి, 28న అక్కిరాజు సుందర రామకృష్ణ నిర్వహణలో భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. జేష్ఠ మాసం పౌర్ణమి సందర్భంగా లలితాదేవి అమ్మవారు శుక్రవారం సాయంత్రం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారని మేనేజర్ తెలిపారు.

రెండు స్కూల్ బస్సులపై కేసు నమోదు



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న రెండు స్కూల్ బస్సులు, ఒక స్కూల్ ఆటోపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. అధికారులు గురువారం చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలను ఉల్లంఘించిన రెండు స్కూల్ బస్సులపై కేసు నమోదు చేశారు. ఎక్కువ మంది స్కూల్ పిల్లలను తీసుకువెళ్తున్న ఆటోను సీజ్ చేశారు. ఇప్పటి వరకు 27 కేసులు నమోదు చేశామని, ఒక బస్సును సీజ్ చేశామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వాహన తనిఖీ అధికారులు కె.ప్రవీణ్‌కుమార్, ఏఎస్ గణేష్ రెడ్డి, మన్మోహన్, మాధవి, రాజారావు, సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిరండూల్ రైళ్లు గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ దంతేవాడ-కమలూర్ సెక్షన్ మధ్య జరుగుతున్న రెండో లైన సంబంధిత ప్రి నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. అలాగే ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 27వ తేదీన కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా జగదల్‌పూర్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ప్లంబింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 (పీఎంకేవీవై) పథకం కింద 8వ తరగతి విద్యార్హత కలిగిన వారికి సుమారు 3 నెలల పాటు జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న నేక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను నేక్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9866883199 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

● ఆనంద యోగం



అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని గురువారం సాయంత్రం వీఎంఆర్డీఏ పార్కు బీచ్‌లో యోగా సాధన చేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

మనిషి అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తిల కలయికే యోగా.. యోగా అనేది వ్యాయామ పద్ధతి కాదు. మనిషి తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే సంపూర్ణ సాధన ప్రక్రియ. ఇది మనసును, శరీరాన్ని, ఆత్మను సమతుల్యంగా ఉంచడం ద్వారా మన జీవన శైలిని మెరుగుపరచడానికి దోహదపడుతుంది. యోగాను రోజువారీ జీవితంలో అమలు చేయడం ద్వారా వ్యక్తిగత ఆధ్యాత్మిక వికాసాన్ని పొందవచ్చు. ప్రపంచ దేశాలు యోగా వైపు చూస్తుండటంతో.. రోజురోజుకు యోగా కేంద్రాలు మారుమూల గ్రామాల్లో సైతం వెలుస్తున్నాయి. మానసిక ప్రశాంతతకు దూరమవుతున్న వారిలో ధైర్యం నింపి భవిష్యత్‌పై భరోసా కల్పిస్తున్నాయి. యోగా ఆరోగ్యంతో పాటు ఎందరికో ఉపాధి సైతం కల్పిస్తోంది. యోగా బోధకులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది.

● సిటీలో సినీతారలు



నగరంలో హీరోయిన్లు హనీ రోజ్, మానస చౌదరి సందడి చేశారు. ఓ కార్యక్రమానికి వచ్చినవారు విశాఖ అంటే తమకు ఎంతో ఇష్టమని తెలిపారు. తెలుగు సినిమా ప్రేక్షకులు తమ చిత్రాలను ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

సుప్రీం షిప్‌యార్డ్

- 83 ఏళ్లు పూర్తి చేసుకున్న హిందుస్తాన్ షిప్‌యార్డ్
- వైఎస్సార్ చొరవతో మూత దశ నుంచి లాభాల బాట
- రూ.1,438 కోట్ల ఆదాయంతో దూసుకుపోతున్న హెచ్ఎస్ఎల్
- ప్రస్తుతం రూ.20 వేల కోట్ల టర్నోవర్
- దేశ భద్రత కోసం 5 ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు సిద్ధం చేస్తున్న హెచ్ఎస్ఎల్
- అత్యాధునిక ఎలక్ట్రానిక్ టెస్టింగ్ ల్యాబ్, టెస్ట్ బెడ్ సౌకర్యం
- 80 టన్నుల క్రేన్ వంటి కొత్త సౌకర్యాలు నేటి నుంచి అందుబాటులోకి..

ఇండస్ట్రీ విభాగంలో దూసుకెళ్లేలా.. సాంకేతిక సంస్కరణలు చేసుకుంటూ.. రూ.20 వేల కోట్ల పనులను సొంతం చేసుకొని.. దేశంలోనే సుప్రీం షిప్‌యార్డుగా హిందుస్థాన్ షిప్‌యార్డు అడుగులు వేస్తోంది. దేశీయ నౌకల తయారీపై దృష్టి సారిస్తూ అత్యుత్తమ సేవలందిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. షిప్‌యార్డు చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.20 వేల కోట్ల టర్నోవర్ సొంతం చేసుకొని.. ఆత్మనిర్భర్ భారత్‌తో నౌకా నిర్మాణం, మరమ్మతుల విషయంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని హెచ్ఎస్ఎల్ నిలబెట్టుకుంటోంది. దివంగత వైఎస్సార్ చొరవతో మూత దశ నుంచి లాభాల బాట పడుతూ నేటితో 83 ఏళ్లు పూర్తి చేసుకొని 84వ వ్యవస్థాపక దినోత్సవాల్ని చేసుకుంటోంది.



షిప్‌యార్డు

సాక్షి, విశాఖపట్నం : ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తూ ఆయా సంస్థలకు అప్పగిస్తున్న హెచ్ఎస్ఎల్.. ఇప్పుడు దేశంలోనే ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. ఇప్పటివరకూ 200 నౌకలు తయారు చేసిన షిప్‌యార్డు తాజాగా 2000 షిప్స్ మరమ్మతుల పనులను కూడా పూర్తి చేసింది. ఈ ఏడాది ఏకంగా రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన కాంట్రాక్టును కూడా దక్కించుకుంది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి సన్నద్ధమవుతోంది. ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్(ఎఫ్ఎస్ఎస్)ని భారత నౌకాదళం, కోస్ట్‌గార్డు కోసం తయారు చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. హై వాల్యూస్‌తో ఈ నౌకల నిర్మాణాలు చేపట్టనుంది. 45 మిలియన్ టన్నుల డిస్‌ప్లేస్‌మెంట్ సామర్థ్యమున్న నౌకల్ని తయారుచేసే ప్రక్రియ ప్రారంభించింది. ఈ నౌకల నిర్మాణాలతో హెచ్ఎస్ఎల్ వార్షిక టర్నోవర్ కూడా గణనీయంగా పెరిగింది. ఇదే ఊపుతో స్వదేశీ పరిజ్ఞానాన్ని దేశీయ పరిశ్రమల్ని మరింతగా ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్న షిప్‌యార్డు.. శుక్రవారం 84వ వ్యవస్థాపక దిన సంబరాలు చేసుకుంటోంది.



వైఎస్సార్ చొరవతో లాభాల బాటలో..

సరైన ఆర్డర్లు రాక నష్టాల బాటపడుతూ కష్టాల సంద్రంలో కొట్టుమిట్టాడుతున్న హిందుస్థాన్ షిప్‌యార్డు దుస్థితిని చూసి చలించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. షిప్‌యార్డుని నౌకాదళంలో విలీనం చేయించడంలో ముఖ్య భూమిక పోషించారు. తొలినాళ్లలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నా క్రమంగా పుంజుకుంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.595 కోట్ల విలువైన పనులు పూర్తిచేసిన షిప్‌యార్డు.. అత్యధిక టర్నోవర్‌గా ఇప్పటివరకూ రికార్డు ఉండేది. ఆ రికార్డును తిరగరాస్తూ షిప్‌యార్డు తొలిసారిగా రూ.759 కోట్ల టర్నోవర్‌ను 2021–22 ఆర్థిక సంవత్సరంలో సాధించింది. ఇందులో రూ.51 కోట్ల వరకూ నికర లాభాల్ని ఆర్జించిన హెచ్ఎస్ఎల్ మొత్తం 60 శాతం వృద్ధి సాధించింది. ఇక అప్పటి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. 2023–24లో రూ.1593 కోట్ల ఆదాయాన్ని, రూ.109 కోట్ల నికర లాభాన్ని ఆర్జించి రికార్డు సృష్టించింది.

రక్షణ, వాణిజ్య రంగాల్లో కీలకంగా హెచ్ఎస్ఎల్

దేశ రక్షణ, వాణిజ్య రంగాల్లో విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ కీలకంగా మారుతోంది. ఏకంగా రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన కాంట్రాక్టుపై సంతకం చేసింది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి సన్నద్ధమవుతోంది. ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్(ఎఫ్ఎస్ఎస్)ని భారత నౌకాదళం, కోస్ట్‌గార్డు కోసం తయారు చేసేందుకు కుదర్చుకున్న ఒప్పందంలో భాగంగా 45 మిలియన్ టన్నుల డిస్‌ప్లేస్‌మెంట్ సామర్థ్యమున్న నౌకలను తయారు చేయనుంది. ఈ నౌకల నిర్మాణాలతో హెచ్ఎస్ఎల్ వార్షిక టర్నోవర్ కూడా గణనీయంగా పెరగనుంది. తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్(ఎఫ్ఎస్ఎస్) నిర్మాణానికి అవసరమైన 44 వేల టన్నుల స్టీల్ కటింగ్ ప్రక్రియ కూడా ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించారు. విశాఖపట్నం పరిసరాల్లో ఉన్న 550 ఎంఎస్ఎంఈల సహకారంతో నౌకా నిర్మాణంలో కీలకంగా అడుగులు వేస్తోంది. ఎంఎస్ఎంఈల ద్వారా 3 వేల మందికి పైగా స్థానికులకు హెచ్ఎస్ఎల్ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

ఆధునికీకరణతో కొత్త పుంతలు



షిప్‌బిల్డింగ్‌లోనూ, వాణిజ్య రంగాల నుంచి వచ్చే ఆర్డర్లతో రాబోయే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేలా నిలదొక్కుకొని ప్రపంచంలోనే నౌకానిర్మాణంలో అగ్రగామిగా నిలవాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాం. ఈ దిశగా చేపడుతున్న పనుల కారణంగా ఇటీవల కాలంలో ఏకంగా 21 జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నాం. 84వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా షిప్‌యార్డు ఆధునికీకరణ పనుల్ని ప్రారంభిస్తున్నాం. అత్యాధునిక ఎలక్ట్రానిక్ టెస్టింగ్ ల్యాబ్‌తో పాటు టెస్ట్ బెడ్ సౌకర్యాల్ని ప్రారంభిస్తున్నాం. అదేవిధంగా 80 టన్నుల హెవీ క్రేన్ అప్‌గ్రేడెడ్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఉద్యోగుల కోసం అత్యాధునిక సౌకర్యాలతో క్వార్టర్స్‌ని ప్రారంభిస్తున్నాం. స్టేక్ హోల్డర్స్‌కు మరింత చేరువయ్యేలా సరికొత్త వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ని ఆవిష్కరిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌కు హెచ్ఎస్ఎల్ కేంద్ర బిందువుగా మారుతోంది. రూ.1000 కోట్లతో యార్డును రానున్న మూడేళ్లలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. భవిష్యత్తులో హెచ్ఎస్ఎల్‌లో జరిగే పనుల్లో సింహభాగం స్వదేశీ పరిజ్ఞానంపైనే ఆధారపడాలనేది మా ముందున్న ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

– కమొడర్ హేమంత్ ఖత్రి, హెచ్ఎస్ఎల్ సీఎండీ

బ్లడ్ డొనేషన్ పేరిట మోసం

అకౌంట్లలో డబ్బులు వేయించుకొని పరారీ

అల్లిపురం: ఆస్పత్రిలో ఆపదలో ఉన్న వ్యక్తికి బ్లడ్ ఇస్తామని డబ్బులు అకౌంట్‌లో వేయించుకొని తరువాత పరారైన ఘటన నగరంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సీపట్నానికి చెందిన సిహెచ్.శ్రీను తన తల్లి నూకాలతల్లికి ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం నగరంలోని కేర్ ఆస్పత్రిలో ఈ నెల 11న చేర్పించాడు. డాక్టర్లు ఆమెకు సర్జరీ చేయడానికి ఏబీ పాజిటివ్ బ్లడ్ 5 యూనిట్లు అవసరమని చెప్పారు. దీంతో శ్రీను తనకు తెలిసిన వారికి వాట్సాప్‌లో రిక్వస్ట్ పెట్టుకున్నాడు. దీనిని ఆసరా చేసుకున్న కొందరు శ్రీనుకు ఫోన్ చేసి బ్లడ్ డోనార్స్ ఉన్నారు.. కానీ శ్రీకాకుళం నుంచి రావాలని రూ.2 వేలు అకౌంట్‌లో వేయించుకున్నారు. మరొకరు ఫోన్ చేసి ట్రాన్స్‌పోర్టు చార్జీల నిమిత్తం రూ.1,030 అకౌంట్‌లో వేయించుకున్నారు.

ఈ నెల 19వ తేదీన సర్జరీ చేయించేందుకు డాక్టర్లు ఏర్పాట్లు పూర్తి చేసినా బ్లడ్ డోనార్స్ రాకపోవటంతో శ్రీను వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చాయి. అందులో ఒకరు తర్వాత ఫోన్ చేసి తాము బ్లడ్ ఇవ్వం.. డబ్బులు ఇవ్వం ఏమి చేసుకుంటావో చేసుకో అని కట్ చేయటంతో బాధితుడు అయోమయస్థితిలో పడ్డాడు. అప్పటికప్పుడు ఇద్దరు డోనార్ల ద్వారా బ్లడ్ బ్యాంకుల నుంచి బ్లడ్ కలెక్ట్ చేయటంతో సర్జరీ పూర్తయిందని తెలిపారు. ఈ విషయమై సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి స్టాంపులు, నాణేల ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న గుప్తా

డాబాగార్డెన్స్: నుమిస్మాటిక్ అండ్ ఫిలాటిక్ సొసైటీ ఆఫ్ విశాఖపట్నం, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో ప్రాచీన నాణేలు, స్టాంపులు, నోట్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు సొసైటీ విశాఖ శాఖ ప్రెసిడెంట్ సీహెచ్‌వీఆర్ గుప్తా, కార్యదర్శి కె.కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

21న సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు, 22న ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు, 23న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి సుమారు 30 మంది సభ్యులు ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు తెలిపారు. విష్ణుపెక్స్-2024 పేరిట ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనను పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ డీఎస్ఎస్‌వీ వర్మ, నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ ప్రారంభిస్తారన్నారు. 65 ఏళ్ల లయన్స్‌క్లబ్ ఆఫ్ విశాఖపట్నం పేరిట ప్రత్యేక స్టాంపు విడుదల చేయనున్నట్లు చెప్పారు.

ఈ ప్రదర్శనలో ప్రాచీన కాలం నాటి బంగారు, వెండి నాణేలు, ఇతరదేశాల్లో తయారు చేసిన బంగారు కరెన్సీ నోట్లు, స్టాంపులు, ఆర్‌బీఐ విడుదల చేసిన రూ.10 నుంచి 1000 వరకు నాణేలు, వెండి నాణేలు, 120 దేశాల్లో చలామణి అయిన నోట్లతో పాటు భారతీయ తపాలా శాఖ ప్రత్యేకంగా వెండితో తయారు చేసి బంగారు పూత పూసిన ప్రత్యేక తపాలా బిళ్లలతో పాటు మరెన్నో నాణేలు, స్టాంపులు, నోట్లు ఉంటాయని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పలు కోర్సుల్లో జూలై 1 నుంచి ఉచితంగా ఏడాది పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ, ఎస్టీ సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంపిటేటివ్ పరీక్షలకు తర్ఫీదు శిక్షణ, 'ఓ'లెవెల్ కంప్యూటర్ ట్రైనింగ్, హార్డ్‌వేర్ ట్రైనింగ్, కంప్యూటర్ అప్లికేషన్, బిజినెస్, అకౌంటింగ్‌లో శిక్షణ, సైబర్ సెక్యూర్ వెబ్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 30 ఏళ్ల గల అభ్యర్థులు అర్హులన్నారు. ఉచితంగా పుస్తకాలు, స్టేషనరీ, ప్రతి నెల రూ.1000 విద్యార్థులకు భత్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://dbtscst.ncs.gov.in/users/signup వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

శిక్షణ, ఉద్యోగావకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సులు నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ నందు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరే అభ్యర్థుల వయసు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలని, ఇంటర్/పదో తరగతి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. మూడు నెలల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ, ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ తదితర సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇంటర్ పాసైన యువతీ యువకులు బీఏస్సీ/డిప్లొమా పారామెడికల్ కోర్సులకు కూడా అర్హులన్నారు. పూర్తి వివరాలకు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ లేదా ద్వారకానగర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు. 72079 53290, 79930 11605 నంబర్లలో ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎగుమతుల మార్కెట్లో విశాఖ కీలకం

ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్



జ్యోతి ప్రజ్వలం చేస్తున్న పంకజ్ కుమార్

బీచ్‌రోడ్డు: ఎగుమతుల మార్కెట్లో విశాఖ ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోందని విశాఖ ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓవర్సీస్ శాఖ ఆధ్వర్యంలోని నగరంలోని ప్రముఖ ఎగుమతిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంకజ్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ అమరావతి సర్కిల్ కుమార్ మోహిత్లు మాట్లాడుతూ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమల నిర్వహించే వారికి సైతం ట్రేడ్ రీసివబుల్స్ ఎలక్ట్రానిక్ డిస్కౌంటింగ్ సిస్టమ్ కార్యకలాపాలను ఇటీవల ప్రారంభించామన్నారు. సమావేశంలో క్రెడిట్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్, వివిధ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఐఐ ప్రతినిధులు సంబంధిత పథకాలు, విధానాలపై ప్రదర్శనలు కూడా చేశారు. విశాఖ రీజినల్ మేనేజర్లు సంజీవ్ కుమార్ , బాల సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఓవర్సీస్ బ్రాంచ్ చక్రధర్ గారపాటి పాల్గొన్నారు.

ఆగస్టు నుంచి క్యాన్సర్‌పై సర్వే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: క్యాన్సర్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ముందుగా దీనిపై అవగాహన కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆంధ్ర మెడికల్ కాలేజీ బోధన ఆస్పత్రి సమావేశ మందిరంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న క్యాన్సర్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ కాంప్రహెన్సివ్ క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆగష్టు ఒకటో తేదీ నుంచి జిల్లాలోని ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్ సర్వే చేస్తారన్నారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని క్యాన్సర్ వ్యాధిని అరికట్టే క్రమంలో నూతన పద్ధతులను అవలంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఈశిక్షణ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పీఎల్ఐపై హైకోర్టులో కేసు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ అధికారులు ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ)పై హైకోర్టులో కేసు వేశారు. స్టీల్‌ప్లాంట్ నుంచి రిటైర్ అయిన సుమారు 722 మంది అధికారులకు యాజమాన్యం పీఎల్ఐ కింద సుమారు రూ.9 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ యాజమాన్యం డబ్బులు లేవన్న సాకుతో పీఎల్ఐ చెల్లించకుండా కాలయాపన చేస్తోంది. దీనిపై స్పందించిన ఉక్కు పదవీ విరమణ అధికారుల సంఘం (ఆర్ఎస్ఈఏ) అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, వాసా మూర్తి, ఉక్కు అధికారుల సంఘం (సీ)ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, దశరథ్ కేసు వేశారు.



వీఎంఆర్డీఏ పార్కు బీచ్‌లో సాధన చేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

ఆసనాలతో ఆరోగ్యమస్తు



వజ్రాసనం

- సర్వ రోగ నివారిణి యోగా
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

అల్లిపురం/గాజువాక/తగరపువలస/పీఎంపాలెం/ఎంవీపీకాలనీ: మారుతున్న కాలంలో ప్రతి మనిషి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఒత్తిడి. అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ రుగ్మతను తగ్గించడానికి 'యోగా' ముఖ్యమైన ఔషధంగా మారింది. భారతీయ తత్వశాస్త్రాల్లో షట్ దర్శనాల్లో న్యాయం, వైశేషికం, వేదాంతం, మీమాంస, సాంఖ్యం తర్వాత యోగం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. వివేకానందుడు చికాగో పర్యటనలో భాగంగా యోగా విద్య ప్రాధాన్యతను ప్రస్తావించారని ప్రతీతి. మనసు, శరీరంపై పట్టు సాధించడమే యోగాభ్యాసం అంతిమ లక్ష్యమని సాధకులు అంటున్నారు. దేహం, మనసు, భావోద్వేగాలను సమతుల్యం చేయడమే యోగమని విశ్లేషిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగా విశిష్టతను తెలియజేసేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

యోగా దినోత్సవం ఈ రోజే ఎందుకు?

ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకుంటారు. 2014 సెప్టెంబర్ 27న ప్రధాని మోదీ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ దినోత్సవం ఏటా జూన్ 21న జరిపేందుకు ప్రతిపాదించారు. సభ్య దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు తెలపడంతో 2015 జూన్ 21న తొలిసారిగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా యోగా డే జరుగుతోంది. ఈ ఏడాది థీమ్ 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ'.

ప్రతీ ఆసనం ఉప'యోగా'మే

ప్రతి రోజూ యోగా సాధన చేయడం ద్వారా వివిధ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని యోగా నిపుణులు పేర్కొంటున్నారు. యోగా వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా మారుతారు. శరీరంలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. క్రమం తప్పకుండా యోగా చేస్తే మానసిక ప్రశాంతతో పాటు శ్వాసక్రియలో ఇబ్బందులు లేకుండా ఉంటుంది. యోగా చేయడం వల్ల శరీరంలో కొన్ని రకాల హార్మోన్లు విడుదలవుతాయి. ఈ కారణంగానే శరీరం విశ్రాంతి పొందుతుంది. వృద్ధాప్య ఛాయలు దూరమవుతాయి. నిద్రలేమి, కంటి సమస్యలు సహా వివిధ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. కొవ్వు నిల్వలు సమతుల్యంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకున్న వారికి యోగా అద్భుత ఔషధమని చెప్పొచ్చు. యోగాతో సామాజిక సంబంధాలు మెరుగుపడతాయి. కాగా.. యోగా ద్వారా ఎంతో మంది ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. యోగా స్టూడియోస్, సెంటర్ల ద్వారా ఉపాధి అవకాశాలు అందుతున్నాయి. టూరిజం, హాస్పిటాలిటీ రంగాల్లో కొత్త అవకాశాలు వస్తున్నాయి. విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెంపొందించడానికి, వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేయడానికి ప్రముఖ విద్యా సంస్థలు సైతం యోగాన్నే ఆశ్రయిస్తున్నాయి. దీంతో విద్యా వ్యవస్థలో కూడా యోగా బోధకులకు డిమాండ్ ఏర్పడింది.



శీర్షాసనంలో..



హలాసనంలో..



సాధన చేస్తున్న చిట్టివలస వాసులు

విస్తృతంగా యోగా శిబిరాలు



యోగా భారతి ట్రస్ట్ ద్వారా నగర వాసులకు విశిష్ట సేవలందిస్తున్నాం. శాస్త్రీయమైన పద్ధతిలో ప్రతీ వ్యక్తిలో దాగి ఉన్న సామర్థ్యాన్ని యోగాతో వెలికితీయడం ద్వారా.. ఒత్తిడిని, శారీరక సమస్యలను పరిష్కరించవచ్చు. ఈ దిశగానే నగరవాసులకు మా శిక్షణ ఉంటుంది. పుస్తక విజ్ఞానం ద్వారా యోగా విశిష్టతను తెలుసుకుని.. బెంగళూరులోని వివేకానంద యోగా అనుసంధాన్ సంస్థాన్‌లో ఏడాది కోర్సు పూర్తి చేశాను. థెరపీ యోగాతో ఏ ఆసనం ద్వారా ఏ శారీరక సమస్యకు ఉపశమనం కలిగించవచ్చో అవపోశన పట్టాను. 2012లో యోగా భారతి ట్రస్ట్ ఏర్పాటు చేసి 10 వేల మందిని భాగస్వాములను చేస్తూ విస్తృతంగా ఉచిత యోగా శిబిరాలు నిర్వహిస్తున్నాను. లక్ష మందికి యోగా నేర్పించాలనే సంకల్పంతో నగరానికి చెందిన 30 మందికి యోగాసనాల్లో ఉచిత శిక్షణ అందించి.. శిక్షకులుగా తీర్చిదిద్దాను. మధురవాడ, కొమ్మాది, ఆరిలోవ, హెల్త్ ఏరీనా, స్వర్ణభారతి, మాధవధార, సుజాతనగర్.. తదితర 30 శిబిరాల ద్వారా రోజూ నగర వాసులకు ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నాం.

–పైడం నాయుడు, యోగా భారతి ట్రస్ట్ వ్యవస్థాపకుడు

యోగా మనది కావడం గర్వకారణం



యోగా మనది కావడం మనకు గర్వకారణం. ప్రపంచానికి మనమే యోగాను పరిచయం చేశామని చెప్పుకోవచ్చు. అలాంటి యోగా విద్యను ప్రతి ఒక్కరూ నేర్చుకుని పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని సాధించాలి. **–గణేష్**

ఆసనాలు మాత్రమే యోగా కాదు



చాలామంది ఆసనాలు మాత్రమే యోగా అని అపోహ పడుతుంటారు. వాస్తవానికి ఇందులో నియమాలు పాటించడం, క్రమశిక్షణ, మరో ఆలోచనలు లేని స్థితికి తీసుకుని వెళ్లడం, ఏకాగ్రత ఇవన్నీ యోగాలో భాగం. అందరూ వీటిని ఆచరించాలి. **– కె.గురుమూర్తి**, చిట్టివలస

మనిషి జీవితకాలం పెరుగుతుంది



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఆరోగ్యానికి చక్కటి మార్గం యోగా. కోవిడ్–19 విజృంభించిన సమయంలో యోగా ప్రాముఖ్యాన్ని అందరూ గ్రహించారు. మానసిక దృఢత్వం, శ్వాస సమస్యలను అధిగమించడంలో యోగా మేలు చేసింది. మనిషి జీవితకాలం పెరగడంతో యోగా సాధన ప్రధాన పాత్ర పోషిస్తుందని రుజువైంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో యోగాపై అవగాహన పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా 2013లో ఓం శ్రీ యోగా సెంటర్ ప్రారంభించాం. ఈ సెంటర్ ద్వారా సీతమ్మధార, ఆక్సిజన్ టవర్స్, దసపల్లా హిల్స్, గాదిరాజు ప్యాలెస్, కొత్తరోడ్డు లైబ్రరీ స్ట్రీట్‌లలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. గతేడాది సంస్థ ఆధ్వర్యంలో గాదిరాజు ప్యాలెస్ వేదికగా 270 మంది 216 యోగాసనాలు వేసి.. యోగాసన వరల్డ్ రికార్డును నెలకొల్పాం. వృద్ధాశ్రమాలు, జైలులో కూడా యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం.

– చిలకా వెంకట రమేష్, ఓం శ్రీ యోగా సెంటర్ వ్యవస్థాపకుడు

క్రమం తప్పకుండా ఆచరిస్తే ఫలితం



యోగాసనాలను క్రమం తప్పకుండా ఆచరిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. ఈ యోగాను గురుముఖంగా బోధించడానికి అనేక కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. కాలుష్యకారకమైన ఈ ప్రపంచంలో యోగాను ప్రతి ఒక్కరూ తమ దినసరి చర్యలో భాగం చేసుకోవాలి.

–దొరకర సత్యనారాయణ, యోగా శిక్షకుడు, భీమిలి

మనసు స్థిరంగా ఉంటుంది



యోగాభ్యాసం ద్వారా మనసు స్థిరంగా ఉంటుంది. ఉద్వేగాలు, ప్రలోభాలకు లొంగకుండా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగా సాధన అలౌకిక ఆనందాన్ని ఇస్తుంది. **–శ్రీనివాసరావు**

వ్యాధులు నయమయ్యాయి



యోగాసనాలు పరిపూర్ణంగా వేయడంలో శిక్షణ పొందాను. తద్వారా యోగా ప్రయోజనాలు గుర్తించాను. 2014 నుంచి ఆస్పత్రి ముఖమే చూడలేదు. కరోనా సమయంలో కూడా ఒక్క మాత్ర కూడా వేయలేదు. నా వద్ద యోగాసనాలు సాధన చేసిన వారెందరో మంచి ఫలితాలు పొందారు. షుగర్, సయాటికా, నడుంనొప్పి, థైరాయిడ్ వంటి వ్యాధుల నుంచి ఉపశమనం పొందారు. పీఎం పాలెం ఆఖరు బస్టాప్ వద్ద యోగా థీమ్ పార్కు, బక్కన్నపాలెంలో వందలాది మందికి యోగాలో శిక్షణ ఇస్తున్నాను.

– అల్లాడ చిట్టిబాబు, యోగా గురు, పీఎంపాలెం

ఆరోగ్యానికి ఎంతో మేలు



యోగా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. స్త్రీ ఆరోగ్యానికి యోగా వల్ల అనేక లాభాలు ఉన్నాయి. పీరియడ్ సమస్యలు తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరాకృతిని, శరీర బరువును నియంత్రించడంలో ముఖ్య పాత్ర వహిస్తుంది. స్త్రీ సౌందర్యం, ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. ఆరేళ్లుగా వైఎస్సార్ సెంట్రల్ పార్కులో మొల్లి కిరణ్ కుమార్ వద్ద యోగాలో శిక్షణ పొందుతున్నాను.

–రీనా, యోగా అభ్యాసకురాలు



పూర్ణ భుజంగాసనం వేస్తున్న వివాహిత

నేటి కార్యక్రమాలు

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వం, పలు యోగా సంస్థల ఆధ్వర్యంలో నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

- ఓం ఉచిత యోగా సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీలోని గాదిరాజు ప్యాలెస్ ప్రాంగణంలో ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు యోగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.
- కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్ వద్ద భారీ చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు ప్రదర్శనలు ఉంటాయి.
- జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీలోని జీవీఎంసీ స్పోర్ట్స్ ఎరీనాలో ఉదయం 6 గంటల నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు.
- ఆర్టీసీ కాంప్లెక్స్ దరి డాక్టర్ వైఎస్సార్ సెంట్రల్ పార్కు, స్వర్ణభారతి స్టేడియం, ఎంవీపీ హెల్త్ ఎరీనా, జిల్లా కోర్టుతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరగనుంది.



గురుద్వారా వద్ద గల ఎస్‌ఎంసీహెచ్ స్కూలు విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

అభ్యసనం.. అధ్యయనం..

ఏయూ యోగా విలేజ్ ప్రయాణం

ఏయూక్యాంపస్: అభ్యసనం.. అధ్యయనంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విలేజ్ దూసుకుపోతోంది. ప్రాచీన భారతీయ సంపద యోగాను వందలాది మందికి చేరువ చేస్తూ.. దశాబ్దాలుగా తన ప్రయాణాన్ని సాగిస్తూ ఆరోగ్యం, మానసిక ఆనందం అందిస్తోంది. యోగా శిక్షణ తరగతులతో పాటు భవిష్యత్ తరానికి అవసరమైన యోగా నిపుణులను తీర్చిదిద్దే ఆశయంతో ఆరు నెలల డిప్లమో, ఏడాది కాల వ్యవధితో పీజీ డిప్లమో, ఎం.ఎ యోగా, పీహెచ్‌డి కోర్సులను నిర్వహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా మూడు తరగతి గదులు, ఈ క్లాస్ రూమ్, మూడు యోగా సాధన మందిరాలు, ధ్యాన మందిరాలు, సమావేశ మందిరం, గ్రంథాలయం, క్రియలు నిర్వహించే ప్రత్యేక ప్రాంగణం ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఐదేళ్ల కాలంలో ఈ విభాగంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఏయూ యోగా విలేజ్‌కి అనుబంధంగా పది అనుబంధ యోగా శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఓ కేంద్రం శ్రీలంకలో ఉండటం విశేషం.

ఉదయం 6 గంటల నుంచే సాధన

యోగా విలేజ్‌లో ఉదయం 6 గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ధ్యానం, యోగా సాధన, క్రియలు నేర్పిస్తారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, వివిధ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారికి కాలానుగుణంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నారు. ఉత్తరాంధ్ర యోగాసన పోటీలను సైతం ఇక్కడ నిర్వహించారు. రక్షణ రంగ సంస్థలు, ప్రభుత్వ సంస్థల ఉద్యోగులకు ప్రత్యేక తరగతులు, శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు.



యోగాసనాలు సాధన చేస్తున్న పూర్వ విద్యార్థులు

యోగా విలేజ్‌ను ఆధునికీకరిస్తున్నాం



యోగా కేంద్రాన్ని మరింత ప్రజలకు చేరువ చేయడానికి వీలుగా ఆధునికీకరిస్తున్నాం. కాలానుగుణంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నాం. అత్యుత్తమ పరిశోధన, శిక్షణ కేంద్రంగా ఏయూ యోగా విలేజ్ సేవలందిస్తోంది.

–ఆచార్య ఒ.ఎస్.ఆర్ భానుకుమార్, కేంద్రం సంచాలకుడు

సిటీలో సినీతారలు

బీచ్‌రోడ్డు: సినీ తారలు హనీరోజ్(వీరసింహారెడ్డి ఫేం), మానస చౌదరి(బబుల్‌గమ్ ఫేం) గురువారం నగరంలో సందడి చేశారు. సిరిపురంలోని వీఐపీ రోడ్డులో అత్యాధునిక టెక్నాలజీతో కాస్మోటాలజీ సేవలు అందించే జే స్టూడియోను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా హనీరోజ్ మాట్లాడుతూ తను నటించిన చిత్రాలను తెలుగు, మలయాళం ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. తెలుగులో అవకాశాలు వస్తున్నాయని, త్వరలోనే మంచి ప్రాజెక్ట్‌తో వస్తానన్నారు. స్టూడియో అధినేత శ్రీకాంత్ మాట్లాడుతూ తాము ఇప్పటికే మూడు బ్రాంచిలను ఏర్పాటు చేశామని, వీటికి నగర వాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అధినేతలు జ్యోతి, రవి పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఎల్‌జీ ఓఎల్ఈడీ విడుదల



ఎల్‌జీ ఓఎల్ఈడీ సీ4 మోడల్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సీతమ్మధార: విశాఖ మార్కెట్‌లోకి ఎల్‌జీ ఓఎల్ఈడీ మోడల్ అందుబాటులోకి వచ్చిందని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ రీజనల్ బిజినెస్ హెడ్ క్రిష్ణాజీ తెలిపారు. ఈ మోడల్‌ను గురువారం ద్వారకానగర్‌లో గల సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో ఎమ్మెల్యే గణబాబు ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ టీవీ ఏఐ ఆధారితంగా పనిచేస్తుందని వీడియో, ఆడియో విభాగాలలో సరికొత్త అనుభూతిని అందిస్తుందని తెలిపారు. మార్కెట్‌లో దీని ధర రూ.1,19,000 నుంచి రూ.2,49,990 వరకూ ఉంటుందని అన్నారు. సంస్థ బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, సోనో విజన్ ప్రతినిధుల పాల్గొన్నారు.

లాడ్జిపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఆరిలోవ: పెదగదిలిలో ఓ లాడ్జిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తించి.. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు యువతులు, ఐదుగురు యువకులు ఉన్నారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెదగదిలి కూడలి వద్ద ఉన్న లాడ్జికి నిత్యం బయట ప్రాంతాల నుంచి యువతీయువకులు వచ్చి రోజుల తరబడి గడుపుతున్నారు. వీరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, ఆరిలోవ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. లాడ్జి యజమానిపై కేసు నమోదు చేశారు. ఆరిలోవలో హెల్త్‌సిటీ ఉండటంతో రోగుల బంధువులకు లాడ్జిలు అవసరమవుతాయి. దీంతో కొందరు పెదగదిలి, చినగదిలి, ఆదర్శనగర్‌లో లాడ్జిలు నిర్వహిస్తున్నారు. ఈ లాడ్జీలన్నీ నివాసాల మధ్యలో ఉండటంతో.. వాటిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల ప్రభావం స్థానిక యువతపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్: పంట పొలానికి నీరు తీసుకునే విషయంలో యువకుడిని హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజులు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ బర్కత్ ఆలీ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఎంద్రపల్లి సంజీవరావు(42) ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు సర్కిల్ పరిధిలోని గిన్నెలు కోట పంచాయతీ పెదబయలు పోలీస్ స్టేషన్ పరిధిలోని లంగుడు గ్రామ నివాసి. మృతుడు లాసంగి గణపతి (27) కూడా లంగుడు గ్రామ నివాసి. వీరికి వ్యవసాయ భూములు ఉన్నాయి. పంట కోతకు వచ్చే సమయంలో ఇద్దరు పొలాలకు నీరు అవసరమైంది. ముందుగా గణపతి తన పొలానికి నీరు చాలా అవసరం అని చెప్పాడు. నిందితుడు అందుకు విరుద్ధంగా గణపతి పొలానికి నీరు ఇవ్వకుండా తన పొలానికి నీరు వాడుకున్నాడు. ఇదే అంశంపై ఇరువురు ఘర్షణ పడ్డారు. సంజీవ్ రావు, గణపతిపై కక్ష పెంచుకున్నాడు. గణపతిని హత్య చేయాలని పథకం వేశాడు. 2016 డిసెంబరు 20వ తేదీన లంగుడు గ్రామంలో ఉదయం 9 గంటల సమయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఇదే అదునుగా సంజీవరావు తన వద్ద నున్న పదునైన సమకత్తితో గణపతి మెడపై నరికాడు. తీవ్ర గాయాలు, రక్తస్రావం మధ్య గణపతి అక్కడికక్కడే మృతి చెందాడు. 17వ తేదీ ఉదయం సంజీవరావు పోలీసులకు లొంగిపోయాడు. అప్పటి పాడేరు సీఐ కె.అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేసి నిందితులపై భారతీయ శిక్షాస్మృతి 302 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు. గణపతి భార్య సూర్యామణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

43 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి రవాణా చేస్తున్న ఒకరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన అయూబ్ యూసఫ్ షేక్ అనే వ్యక్తి బ్యాగులో రూ.2,15,500 విలువ గల 43.1 కిలోల గంజాయి ఉండటం గుర్తించారు. ఈ గంజాయిని స్వాధీనం చేసుకుని.. అతన్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు తెలిపారు. ఈ గంజాయిని విశాఖపట్నం మీదుగా సికింద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

పాత నిందితుడి అరెస్ట్

గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన మెండ నారాయణరావు(పాత కేసులో ఎ–2 నిందితుడు) పట్టుబడ్డాడు. అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు తెలిపారు.

3 కిలోలు.. ముగ్గురు అరెస్ట్

మద్దిపాలెం: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. కంచరపాలెం బర్మా క్యాంపునకు చెందిన వై.రమేష్, ఎం.అనిల్‌కుమార్, డి.కిశోర్ బుధవారం రాత్రి కైలాసపురం సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ దివ్యభారతి దాడి చేసి.. వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ విజేతలకు సత్కారం

మురళీనగర్: జాతీయ, అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించి, వారి ప్రతిభను ప్రోత్సహించాలని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ కోరారు. ఇటీవల అయోధ్యలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024లో రాష్ట్రం తరఫున పాల్గొని, పతకాలు సాధించిన విశాఖపట్నానికి చెందిన 21 మంది క్రీడాకారులను గురువారం సత్కరించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజేతలందరికీ రూ.2 వేలు చొప్పున నగదు బహుమతిని మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య జనకులం ఫౌండేషన్ తరఫున అందజేస్తామని ప్రకటించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైద్ మాట్లాడుతూ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు ఆర్థిక పరంగా సహకరిస్తామన్నారు. ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ పి.రంగారావు, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సీహెచ్.శ్రీనివాసరాజు, దుర్గా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ఇళ్లపు రాము, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.పద్మావతి, యూనివర్సల్ యూత్ వాకర్స్ అధ్యక్షులు వంశీ చింతలపాటి తదితరులు క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందించారు.

వ్యాక్సినేషన్‌కు ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

బీచ్‌రోడ్డు: వివిధ రకాల వ్యాక్సినేషన్ కోసం నగరంలో ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఫైజర్ ఇండియా డైరెక్టర్ సంతోష్ తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వివరాలను గురువారం ఆయన మీడియాకు వివరించారు. కిమ్స్ ఆస్పత్రి భాగస్వామ్యంతో ఆస్పత్రి ప్రాంగణంలో ఈ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.